సాక్షి
రంగారెడ్డి
శనివారం : 7 : జనవరి : 2023



వైద్య సిబ్బందిని నియమించండి

తలకొండపల్లి పీహెచ్‌సీలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ డిమాండ్ చేశారు. 4లో▸



నిధుల 'పంచాయితీ'

నిధుల లేమితో పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు కొన్ని నెలలుగా రావడం లేదు. 4లో▸

ప్రీబిడ్‌కు స్పందన

సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ ల్యాండ్ పార్సెళ్లకు అనూహ్య స్పందన లభించింది. వరుసగా మూడోరోజు మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా పరిధిలోని 8 ల్యాండ్ పార్సెల్స్‌పైన శుక్రవారం బేగంపేట్‌లోని టూరిజం హోటల్ ప్లాజాలో నిర్వహించిన ప్రీ బిడ్ సమావేశం విజయవంతం అయ్యింది. దాదాపు వంద మంది ఔత్సాహికులు, రియల్టర్లు ల్యాండ్ పార్సిళ్ల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తూ సమావేశానికి హాజరయ్యారు.

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్ పాలనపై ప్రజల్లో విరక్తి

మాజీ మంత్రి సుద్దాల దేవయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజలు విసిగి వేసారి పోయారని, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి సుద్దాల దేవయ్య అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ ఎన్ను యాదిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీలోని బొంగ్లూర్ క్లెం జంగారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో లిక్కర్, ఇసుక, భూ మాఫియా రెచ్చి పోతోందని అన్నారు. భూ అక్రమాల్లో ఎమ్మెల్యేల పాత్ర ఉందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆగడాలపై బండి సంజయ్ నాయకత్వంలో బీజేపీ నిరంతరం పోరాడుతుందన్నారు. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో ప్రచారీ అరుణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్త అశోక్‌గౌడ్, పార్లమెంట్ జాయింట్ సెక్రెటరీ నారాయణ యాదవ్, మీడియా సెల్ జిల్లా కన్వీనర్ అశోక్, నవజీవన్ రెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీకే సింగ్

హయత్‌నగర్: నాణ్యమైన పోషకాలు ఉండే ఎరువుల వాడకంతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ (క్రిడా) డైరెక్టర్ వీకే సింగ్ అన్నారు. ఇఫ్కో ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లోని క్రిడాలో శుక్రవారం జరిగిన రైతు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటలకు వివిధ దశల్లో పలు రకాల పోషకాలు అవసరం ఉంటాయని, రైతులు సమయస్ఫూర్తితో వ్యవహరిరచి నిపుణుల సలహా మేరకు ఎరువులు వాడితే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. నానో ఎరువుల వాడకంతో పంటల దిగుబడితో పాటు నేల సారాన్ని పెంచవచ్చని సూచించారు. ఈ సందర్భగా ఎరువుల వాడకంపై క్షేత్ర స్థాయిలో వినియోగించే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 150 మంది రైతులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. క్రిడా సైంటిస్ట్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇఫ్కో ప్రతినిధి చంద్రన, వెంకటేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఆర్థిక సహాయ పథకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కె.ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023 సంవత్సరానికి గాను సబ్సిడీ రుణాలు అందించనున్నట్టు తెలిపారు. ముస్లింలు, సిక్కులు, పార్సీలు, బౌద్ధులు, జైనుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకు లింక్, నాన్ బ్యాంకు లింక్ రుణాలు అందించనున్నట్లు వెల్లడించారు. మైనార్టీలకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారురు. 21 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సులై ఉండాలని, కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు, దరఖాస్తుదారుడి ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డుతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ కోసం తేదీ పొడిగించినట్లు వివరించారు.

హైటెక్‌సిటీ మెట్రోస్టేషన్‌లో వీసా దరఖాస్తు కేంద్రం

సాక్షి, సిటీబ్యూరో: హైటెక్‌సిటీ మెట్రో స్టేషన్‌లో అమెరికా వీసా దరఖాస్తు కేంద్రం ఆదివారం ప్రారంభం కానుంది. వీసా అప్లికేషన్ సెంటర్‌గా పిలిచే ఈ కేంద్రంలో అమెరికాకు వెళ్లాలనుకునేవారి వేలిముద్రల సేకరణ, వీసా దరఖాస్తు పత్రాల సమర్పణ, ఇంటర్వ్యూ తదితర సేవలను అందించనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాన్ని అమెరికా కాన్సులేట్ అధికారులు ఏర్పాటుచేశారన్నారు. ప్రస్తుతం ఈ కేంద్రం బేగంపేట్‌లోని కాన్సులేట్ సమీపంలోని గౌరా గ్రాండ్ భవన్‌లో ఉన్న విషయం విదితమే. నగరవాసులు, మెట్రో ప్రయాణికులు ఈ కేంద్రాన్ని వినియోగించుకోవాలని మెట్రో అధికారులు కోరారు.

'కంటి వెలుగు'కు సన్నద్ధం



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

18 నుంచి రెండో విడత ప్రారంభం

- జిల్లా వ్యాప్తంగా 80 బృందాలు
- ఒక్కో బృందం రోజుకు 300-400 మందికి పరీక్షలు
- అవసరమైనవారికి నెలరోజుల్లో కంటి అద్దాలు
- ఇప్పటికే జిల్లాకు 83,645 రీడింగ్ గ్లాసుల సరఫరా
- విజయవంతం చేయాలని మంత్రి సబితారెడ్డి పిలుపు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి సర్వం సిద్ధమైంది. మొదటి విడతలో ఎనిమిది నెలల పాటు చేపట్టిన ఐ స్క్రీనింగ్ ఆశించిన దానికంటే అధిక ఫలితాన్నిచ్చింది. అదే స్ఫూర్తితో రెండో విడతగా ఈ నెల 18 నుంచి వంద రోజుల పాటు ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలను ఉచితంగా అందజేయనుంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 80 కంటి వైద్య బృందాలను ఎంపిక చేశారు. ఆప్టోమెట్రిస్ట్‌తో పాటు మరో 80 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్ల (డీఈఓ)ను తాత్కాలిక అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఎంపిక చేశారు. రోజువారీ నిర్వహించే క్యాంపుల వివరాలు, రోగి పేరు, ఆధార్ నంబర్, చిరునామా సహా కంప్యూటరైజ్డ్ స్క్రీనింగ్‌లో నిర్ధారించిన దృష్టి లోపం, ఇవ్వాల్సిన కంటి అద్దాలు, బార్‌కోడ్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు వారికి శిక్షణ ఇస్తున్నారు.

పంచాయతీలు, మున్సిపాలిటీల్లో అవగాహన

జిల్లాలో 558 పంచాయతీలు, 23 జీహెచ్‌ఎంసీ వార్డులు, 358 యూఎల్‌బీసీల్లో స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించనున్నారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు (సోమవారం నుంచి శుక్రవారం వరకు) మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నారు. ఒక్కో బృందంలో ఒక మెడికల్ ఆఫీసర్ సహా ఆప్టో మెట్రిస్ట్, ఒక సూపర్ వైజర్, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ముగ్గురు ఆశాలు, ఒక డీఈఓ ఉంటారు. ఒక్కో బృందం రోజుకు గ్రామీణ ప్రాంతాల్లో 300 మందికి, పట్టణ ప్రాంతాల్లో 400 మందికి ఆటో రిఫ్రక్టోమీటర్(ఏఆర్) ద్వారా కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేస్తారు. 9న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, మండల కేంద్రాల్లో, 10న పంచాయతీల్లో కంటి వెలుగుపై అవగాహన కల్పించనున్నారు. వంద రోజుల్లో కనీసం 12 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన అద్దాలను సరఫరా చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. జిల్లాకు ఇప్పటికే 83,645 రీడింగ్ గ్లాసులు వచ్చాయి. పరీక్షలు చేసిన నెల రోజుల్లోపే అద్దాలు పంపిణీ చేయడంతో పాటు ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ పూర్తి చేయనున్నారు.

సమీక్ష సమావేశం

కంటి వెలుగుపై మంత్రి సబితారెడ్డి శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు పిలుపునిచ్చారు. గ్రామం, మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్లలో క్యాంపులు నిర్వహించి అవసరం ఉన్న వారికి అద్దాలు పంపిణీ చేయాలని సూచించారు. రేషన్ షాపులు, పంచాయతీ కార్యాలయాల వద్ద బోర్డుల ఏర్పాటు చేయాలని, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ, మున్సిపల్ ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని, కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి, ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ, మూసీ రివర్ బోర్డు చైర్మన్ సుధీర్ రెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, సురభి వాణీదేవి, దయా నంద్ గుప్తా, ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కాలె యాదయ్య, ప్రకాశ్ గౌడ్, జైపాల్ యాదవ్, గ్రంథాలయ, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లు సత్తు వెంకటరమణ రెడ్డి, మనోహర్ రెడ్డి, కృష్ణారెడ్డి, కలెక్టర్ అమయ్‌కుమార్, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు, వివిధ మున్సిపాలిటీల మేయర్లు, చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మార్కెట్, సొసైటీ, రైతుబంధు చైర్మన్లు పాల్గొన్నారు.

తొలి విడతలో చేసిన పరీక్షలు

కంటి పరీక్షలు చేయించుకున్న వారు	8,65,576
కళ్లద్దాల పంపిణీ	3,21,726
రీడింగ్ గ్లాసుల పంపిణీ	1,99,767
ప్రిస్కిప్షన్ గ్లాసుల పంపిణీ	1,21,959
చికిత్సలు అవసరమైన వారు	58,230
చికిత్సలు చేయించుకున్న వారు	6,000
ఇప్పటికీ ఎదురు చూస్తున్నవారు	50,230



శ్రీరాంనగర్‌లో రైతులతో ముఖాముఖిలో పాల్గొన్న కేంద్ర బృందం సభ్యులు, రైతులు

అన్ని రకాల సబ్సిడీలు పెంచాలి

- కేంద్ర బృందంతో రైతుల ముఖాముఖి

మొయినాబాద్: ఎరువులు, విత్తనాలు, పరికరాలపై ప్రభుత్వం సబ్సిడీలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందంతో రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై కేంద్ర అధికారుల బృందం శుక్రవారం మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం జాయింట్‌సెక్రటరీ, ఐఏఎస్ అధికారి శ్యామ్యూల్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంత్ కె.జెంగడే రైతులతో మాట్లాడి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరు, లబ్ధిపొందుతున్నవిధానం తెలుసుకున్నారు.రైతులు మాట్లాడుతూ.. వ్యవసాయంలో ఉపయో గించే అన్ని రకాల పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై ఇవ్వాలన్నారు. విత్తనాలు, ఎరువులపైనా సబ్సిడీ పెంచాలని.. మార్కెట్ సౌకర్యాలు కల్పించి ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకం ద్వారా రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తూ అన్ని రకాల సబ్సిడీలను ఎత్తివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్ట పరిహారం, డ్రిప్‌పై సబ్సిడీ ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇచ్చే సబ్సిడీలు కొంత మంది రైతులు, కొన్ని గ్రామాలకే అందుతున్నాయని.. వాటిని అన్ని గ్రామాలకు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి, ఏడీఏ రమాదేవి, స్థానిక సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ రాంరెడ్డి, మండల వ్యవసాయాధికారి రాగమ్మ, ఏఈఓ కుమార్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో పర్యటన

చేవెళ్ల: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారని కేంద్ర వ్యవసాయాధికారుల బృందం సభ్యులు అన్నారు. మండలంలోని మల్కాపూర్‌లో శుక్రవారం బృందం సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా నూనెగింజల పథకం కింద అందించి తెల్లకుసుమల పంటల సాగును, వర్షాధారిత ప్రాంత అభివృద్ధి పథకం కింది రైతులకు అందించిన గేదెలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర పథకాల గురించి ప్రజలకు ఏ మేర తెలుసని ఆరా తీశారు. కార్యక్రమంలో ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర వ్యవసాయశాఖ జాయింట్ సెక్రటరీ (జీఐఓ) ఎస్.అనిల్‌కుమార్, మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి.చంద్రశేఖర్, రాష్ట్ర స్పెషల్ కమిషనర్ హన్మంతు, మేనేజ్ సైంటిస్ట్ డాక్టర్ సాగర్, జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి, చేవెళ్ల ఏడీఏ రమాదేవి, ఏఓ తులసి, ఏఈఓలు వరుణ్, రమేశ్, అశోక్, సర్పంచ్ శేరి శివారెడ్డి, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, గ్రామస్తులు జి.రవీందర్, కాంత్ రెడ్డి, మహేందర్, సత్య, సంజీవ, రాజు, రమేశ్, లింగం తదితరులు ఉన్నారు.



నార్సింగి ఓఆర్‌ఆర్ వద్ద పొగమంచు

పొగమంచు..చిరుజల్లులు

- వాతావరణంలో అనూహ్య మార్పులు
- కమ్మేసిన కారుమబ్బులు.. ఈశాన్యం నుంచి చలిగాలులు

సాక్షి, సిటీబ్యూరో: తెల్లవారుజామున దట్టమైన పొగమంచు.. పలు చోట్ల చిరుజల్లులు నగరాన్ని కుమ్మేశాయి. శుక్రవారం వాతావరణంలో ఒక్కసారిగా అనూహ్య మార్పులు చోటుచేసుకోవడంతో వృద్ధులు, చిన్నారులు, శ్వాసకోశ సమస్యలున్నవారు ఉక్కిరిబిక్కిరయ్యారు. జలుబు, వైరల్ ఫీవర్స్, ఒళ్లు నొప్పులు, గొంతు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నవారి సంఖ్య భారీగా పెరిగింది. తూర్పు, ఈశాన్య దిశల నుంచి వీస్తున్న చలిగాలులు గజగజలాడిస్తున్నాయి. ఆకాశం మేఘావృతమవడంతో కనిష్ట ఉష్ణోగ్రతలు 20.9 డిగ్రీల మేర నమోదైనప్పటికీ.. కిందిస్థాయి గాలుల కారణంగా చలితీవ్రత పెరిగినట్లు బేగంపేటలోని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 11 వరకు నగరంలో అతిశీతల పరిస్థితులు నెలకొంటాయని, కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు భారీగా తగ్గుముఖం పట్టి చలితీవ్రత పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొంది. కనిష్ట ఉష్ణోగ్రత 11 డిగ్రీలకు పడిపోయే అవకాశం ఉంటుందని తెలిపింది. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో విధిగా మాస్క్ ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, ఆహారం విషయంలోనూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

శుక్రవారం ఉదయం నగరంలోని ఎల్బీనగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, అమీర్‌పేట్, పంజగుట్ట, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, చింతల్, బాలానగర్, సుచిత్ర, కుత్బుల్లాపూర్, బేగంపేట, తార్నాక, హబ్సిగూడ తదితర ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

క్రమబద్ధీకరణ తర్వాతే అనుమతులు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జీవో 118 వర్తించే 44 కాలనీల ప్రజలు కొత్తగా ఇళ్లు కట్టుకోవాలనుకున్నా, పునర్నిర్మించుకోవాలనుకున్నా క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తయి వారికి హక్కు లభించాకే సాధ్యం కానుంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో 44 కాలనీల్లోని స్లమ్స్‌లో నివసిస్తున్నవారు, బలహీనవర్గాలు, నిమ్న, మధ్య తరగతి ఆదాయాల వారు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జీవో 118 జారీ చేయడం తెలిసిందే. సదరు దరఖాస్తుల స్వీకరణ, ఆమోదం బాధ్యతలు, కన్వేయన్స్ డీడ్ నిర్వహణను ప్రభుత్వం జిల్లాల కలెక్టర్లకు అప్పగించింది. సంబంధిత కలెక్టర్లు దరఖాస్తుల స్క్రీనింగ్, క్రమబద్ధీకరణ పూర్తిచేశాకే ప్రజలు టీఎస్‌బీపాస్ ద్వారా భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తు చేసుకోవచ్చునని జీహెచ్‌ఎంసీ పేర్కొంది. టీఎస్ బీపాస్ ద్వారా దరఖాస్తు చేసుకొని, భవననిర్మాణం పూర్తయ్యాక అసెస్‌మెంట్ చేసి ఆస్తిపన్ను గుర్తింపు నంబరు(పీటీఐఎన్) జారీ చేయనున్నట్లు పేర్కొంది. సదరు కాలనీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పార్టీల మధ్య లిటిగేషన్లుండటం, ప్రైవేట్ డెవలపర్ల లేఔట్లలో ఇళ్లు నిర్మించుకోవడం, తదితర కారణాలతో ప్రాథమిక సౌకర్యాలు, అభివృద్ధి కార్యక్రమాలు వంటివి జరగలేదు. రెవెన్యూ విభాగం క్రమబద్ధీకరణ దరఖాస్తుల స్క్రీనింగ్, ఆమోదం పూర్తిచేశాక టీఎస్-బీపాస్ ద్వారా నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవచ్చని జీహెచ్‌ఎంసీ తెలిపింది. ఇటీవల జరిగిన జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశం సందర్భంగా సభ్యులడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలు వెల్లడించింది.

సెల్ఫ్ అసెస్‌మెంట్స్‌తో ఇంటినంబర్లు రావు..

ఇటీవలి కాలం వరకు ప్రజలు సెల్ఫ్ అసెస్‌మెంట్‌కు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే చాలు ఆస్తి పన్ను ఎంత చెల్లించాలో తెలపడంతో పాటు చెల్లించగానే ఇంటినంబరు సైతం ఆన్‌లైన్‌లోనే జారీ చేసిన జీహెచ్‌ఎంసీ 'అప్పుడో లెక్క.. ఇప్పుడో లెక్క- అక్రమాలే పక్కా' శీర్షికన 'సాక్షి'లో వెలువడిన కథనంతో ఆ విధానానికి స్వస్తి చెప్పింది. సంబంధిత డిప్యూటీ కమిషనర్లు పరిశీలించాకే ఇంటినంబరు కేటాయించే విధానాన్ని అమల్లోకి తెచ్చింది.

మరో రెండు నెలల్లో సైకిల్ ట్రాక్



- శరవేగంగా పనులు
- మార్చి నాటికి వినియోగంలోకి..
- అంతర్జాతీయ ప్రమాణాలతో 23 కిలోమీటర్ల ట్రాక్
- సుమారు రూ.100 కోట్లతో నిర్మాణం

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అధునాతన సైక్లింగ్ ట్రాక్ నిర్మాణం తుది దశకు చేరుకుంది. మరో రెండు నెలల్లో ట్రాక్‌పై సైకిళ్లు పరుగులు తీయనున్నాయి. దేశంలోనే తొలిసారిగా ఔటర్ రింగ్ రోడ్డును ఆనుకొని 23 కిలోమీటర్ల మార్గంలో ట్రాక్ నిర్మాణం చేపట్టిన సంగతి తెలిసిందే. పర్యావరణ పరిరక్షణ కోసం సైక్లింగ్‌ను ప్రోత్సహించే లక్ష్యంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) ఈ నిర్మాణాన్ని చేపట్టింది. గతేడాది సెప్టెంబర్‌లో మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. సుమారు రూ.100 కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టును రెండు మార్గాల్లో చేపట్టారు. ఔటర్‌ను ఆనుకొని నానక్‌రామ్‌గూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు 8.5 కిలోమీటర్లు, కొల్లూరు నుంచి నార్సింగి వరకు 14.5 కిలోమీటర్ల మార్గంలో 5.3 మీటర్ల వెడల్పుతో, మూడు లైన్లలో ట్రాక్‌ను నిర్మిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో ప్రపంచంలోని అత్యుత్తమ నగరాలకు ధీటైన అభివృద్ధి జరుగుతుందని హెచ్‌ఎండీఏ కమిషనర్ అరవింద్‌కుమార్ తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిస్తోన్న సైకిల్ ట్రాక్ నగర ప్రతిష్టను మరింత పెంచుతుందన్నారు.

ఆరోగ్యవిహారం..

సైక్లింగ్ ట్రాక్‌లో సైకిళ్లపైన పరుగులు తీయడం కేవలం ఒక వ్యాయామ ప్రక్రియగానే కాకుండా ఒక విహారంలాంటి అనుభూతిని కలిగించేవిధంగా అందంగా తీర్చిదిద్దుతున్నారు. ట్రాక్ పొడవునా అక్కడక్కడా రెస్ట్‌రూమ్‌లు, కెఫెటేరియాలు, బ్రేక్‌ఫాస్ట్ సెంటర్‌లు ఉంటాయి. అలాగే సైకిళ్లను ఇక్కడే అద్దెకు తీసుకోవచ్చు. సైకిళ్లకు పంక్చర్‌లయినా, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మరమ్మతులు చేసి ఇస్తారు. ట్రాక్ పొడవునా తాగునీటి సదుపాయం, ప్రథమ చికిత్స కేంద్రాలు ఉంటాయని హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. అలాగే ట్రాక్‌ను పూర్తిగా పచ్చదనం ఉట్టిపడేవిధంగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ మార్గంలో సైక్లింగ్ చేసేవారికి ఆకుపచ్చ నడవాలు పరుగులు తీస్తున్న అనుభూతి కలుగుతుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందిస్తున్న ఈ ట్రాక్‌పైన సైక్లింగ్ పోటీలను కూడా నిర్వహించనున్నారు. మరోవైపు భద్రత దృష్ట్యా ట్రాక్ పొడవునా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.



సౌర విద్యుత్ వినియోగం..

ట్రాక్‌పై కప్పును పూర్తిగా సౌరఫలకలతో ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల 16 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ విద్యుత్‌ను ట్రాక్ అవరాలకు వినియోగించనున్నారు. లైట్లు, తదితర అన్ని సదుపాయాలు కల్పిస్తారు. ఇక్కడ వినియోగించగా మిగిలిన విద్యుత్‌ను ఇతరులకు వినియోగించే అవకాశం ఉంది. ఈ 23 కిలోమీటర్‌ల ట్రాక్ నిర్మాణం పూర్తయిన తరువాత రెండో దశలో గండిపేట వద్ద అతి పెద్ద సైకిల్ ట్రాక్ నిర్మించనున్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయండి

మొయినాబాద్: గురుకుల విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి రోనాల్డ్ రోస్ అన్నారు. శుక్రవారం నగరంలోని బూర్గుల రామకృష్ణ భవన్‌లో పీఈడీ, పీఈటీల అసోసియేషన్‌కు సంబంధించిన టేబుల్ క్యాలెండర్, డైరీని గురుకుల కార్యదర్శి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు నిరంతరం కృషి చేయాలని చెప్పారు. సంఘం ఆధ్వర్యంలో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పీఈడీ, పీఈటీల అసోసియేషన్ సంఘం నాయకులు శంకర్, శ్రీనివాస్, వాసు, లాలు, కిషన్, చందర్‌నాయక్, వెంకటేశ్వర్లు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



గురుకుల విద్యాసంస్థల పీఈడీ, పీఈటీల అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



యాత్రలో పాల్గొన్న నాయకులు

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య

చేవెళ్ల: ఆర్టీసీని పరిరక్షించాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య అన్నారు. సీఐటీయూ చేపట్టిన రవాణా కార్మికుల సంఘర్షణ యాత్ర శుక్రవారం చేవెళ్లకు చేరుకుంది. చేవెళ్ల డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో యాత్రకు ఘన స్వాగతం పలికారు. ముందుగా చేవెళ్లలోని చౌరస్తాలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 20లక్షల మందికిపైగా కార్మికులు రవాణా రంగంలో పనిచేస్తున్నారని తెలిపారు. ఇందులో ఎక్కువగా ఆటో ట్యాక్సీ, గూడ్స్ రవాణా, స్కూల్ బస్సుల వంటి వాటిలో పనిచేస్తున్నారని చెప్పారు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు దొరకని పరిస్థితుల్లో ఈ రంగంలో స్వయం ఉపాధిని పొందుతూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. వీరి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమ య్యాయని విమర్శించారు. కార్మికులకు ఎలాంటి సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుష్పాల శ్రీకాంత్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి కవిత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రకుమార్, చేవెళ్ల డివిజన్ కన్వీనర్ అల్లి దేవేందర్, ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్, శ్రీకాంత్, ఆటో యూనియన్ నాయకులు ప్రవీణ్ గౌడ్, బాబు, రవి, అంగన్‌వాడీ సెక్టార్ నాయకులు వరలక్ష్మి, ఉమ, లక్ష్మి, స్వప్న, కల్పన, ప్రేమలత, మంగమ్మ, రాధ, సౌభాగ్య, ప్రవీణ,భాగ్యమ్మ, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

నిధుల పంచాయితీ

- నాలుగు నెలలుగా జీపీలకు విడుదల కాని నిధులు
- పారిశుద్ధ్య పనులు, ట్రాక్టర్ల కిస్తీ కట్టలేని స్థితిలో పంచాయతీలు
- అప్పులు తెచ్చి పనులు చేస్తున్నామని సర్పంచుల ఆవేదన



మక్తగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం

షాబాద్: జిల్లాలోని గ్రామ పంచాయతీలకు నిధుల గ్రహణం పట్టింది. నిధుల లేమితో పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులను కొన్ని నెలలుగా విడుదల చేయడం లేదు. నిధుల విడుదలలో జాప్యంతో సర్పంచ్‌లు అటు ప్రజలకు సమాధానం చెప్పలేక.. ఇటు పనులు పూర్తి చేయలేక సతమతమవుతున్నారు. అయితే అధికారులు నిధులు వచ్చాయని చెబుతుండగా, సర్పంచ్‌లు ఖాతాల్లో జమ కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

కేంద్ర, రాష్ట్ర నిధులతో అభివృద్ధి

గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏటా నాలుగు సార్లు నిధులు విడుదలయ్యేవి. ప్రస్తుతం నెలనెలా ఈ నిధులు విడుదల అవుతున్నాయి. ఒక నెల కేంద్ర ప్రభుత్వం, మరో నెల రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నాయి. వీటితోనే పంచాయతీల్లో వివిధ రకాల పనులు చేపట్టాల్సి ఉంటుంది. అయితే కేంద్రం, రాష్ట్రం నుంచి నాలుగు నెలలుగా నిధులు అందడం లేదు.

ఆగస్టు తర్వాత అంతే...

ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ నిధులు రూ.57,26,09,590 విడుదలయ్యాయి. నెలకు సాధారణ నిధులతో పాటు షెడ్యూల్ క్యాస్ట్ సబ్ ప్లాన్, ట్రైబల్ ప్లాన్ కింద రూ. 11,45,21,918 చొప్పున విడుదల చేశారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. నాలుగు నెలలుగా నిధులు రాకపోవడంతో అభివృద్ధి పనులు సాగడం లేదు. ఇక పెండింగ్‌లో ఉన్న మ్యాచింగ్ గ్రాంట్‌తో రూ. 31,79,33,569ను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు చెబుతున్నా సర్పంచ్‌లు ఖాతాల్లో పడలేదని తెలిపారు.

పనుల్లో జాప్యం..

ప్రభుత్వం నుంచి నిధులు రాక గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం నర్సరీల్లో మొక్కల పెంపకానికి ఎరువులు, విత్తనాలను సర్పంచ్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇక పారిశుద్ధ్య పనుల నిర్వహణకు నిధులు లేకపోగా, చిన్న పంచాయతీల సర్పంచ్‌లు ట్రాక్టర్ కిస్తీ చెల్లించలేక ఆవేదన చెందుతున్నారు. ప్రతిరోజు చెత్త తరలింపు, అవెన్యూ ప్లాంటేషన్‌కు నీటి సరఫరా, ఇతరత్రా పనులకు ట్రాక్టర్ నిర్వహణ, డీజిల్‌కు సైతం డబ్బులు లేవు. ఇవేకాక తాగునీటి పైపులైన్ల లీకేజీలు, వీధి లైట్ల కొనుగోలు, మోటార్ల మరమ్మతులను సైతం సర్పంచ్‌లే సొంతంగా చేయిస్తుండగా, ప్రతినెలా సిబ్బంది వేతనాల కోసం నానా తంటాలు పడుతున్నారు.

అప్పులు తెచ్చి పనులు



రోడ్లు, డ్రైనేజీలు, ఇంకుడు గుంతల నిర్మాణంతో పాటు పంచాయతీ నిర్వహణ ఖర్చులు దాదాపు రూ.10 లక్షలు రావాల్సి ఉంది. నెలల తరబడి ప్రభుత్వం నిధులు ఇవ్వక పోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ఇలా అయితే గ్రామాల్లో అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందో ప్రభుత్వాలు ఆలోచించాలి.

– శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్, మక్తగూడ

వేతనాలు, విద్యుత్ బిల్లులకే సరి



పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రావడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసే నిధులు సిబ్బంది జీతాలు, కరెంట్ బిల్లులకే సరిపోతున్నాయి. దీనికి తోడు రూ. లక్షకు రూ.18 వేలు జీఎస్టీ పేరుతో కోత విధిస్తున్నారు. దీంతో నాలుగో వంతు జీఎస్టీ కోతలకే పోతున్నాయి.

– అనితారెడ్డి, సర్పంచ్, పెట్లఎర్రవల్లి

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఇబ్రహీంపట్నం రూరల్: తాళం వేసిన ఇంట్లోకి దొంగలు పడి బంగారు నగలు, వెండి వస్తువులు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. క్రైం ఎస్ఐ సురేష్ కథనం ప్రకారం.. బాలాపూర్ మండలం నాదర్‌గుల్ ప్రాంతానికి చెందిన పగడాల హరినాథ్ ఈ నెల 3న భార్య భాగ్యమ్మ, కుతురు సౌజన్యతో కలిసి శ్రీశైలం విహార యాత్రకు వెళ్లాడు. దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డారు. బీరువా తీసి అందులోని బంగారు పుస్తెలతాడు, రెండు జతల బంగారు రింగులు, చెవి రింగులు, చేతి ఉంగరాలు, నల్లపూసల తాడు, నక్లెస్, చేతి కడియం (15 తులాల బంగారం), 17తులాల వెండి ఆభరణాలు, రూ.2.50 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. వీటితో పాటు విదేశీ కరెన్సీ కూడా ఉన్నట్లు తెలిపారు. చుట్టూ పక్కల వారు సమాచారం ఇవ్వడంతో హరినాథ్ ఈ నెల 5వ తేదీ ఇంటికి చేరుకొని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సంక్రాంతి పండుగకు ఊరికి వెళ్లే వారు ఇళ్లల్లో విలువైన వస్తువులు ఉంచరాదని పోలీసులు సూచించారు.

వైద్య సిబ్బందిని నియమించండి

- ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి
- టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ డిమాండ్
- డీఎంహెచ్ఓ వెంకటేశ్వరావుకు వినతి


డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనివాస్, తదితరులు

తలకొండపల్లి: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత వేధిస్తోందని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని శివరాంపల్లి జిల్లా ఆరోగ్య కేంద్ర కార్యాలయంలో డీఎంహెచ్ఓ వెంకటేశ్వరావును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో పలు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సకాలంలో రోగులకు వైద్య సేవలు అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ సీహెచ్ఈఓగా పని చేస్తున్న జ్ఞానేశ్వర్ డిప్యూటేషన్‌పై కందుకూర్ డివిజన్‌లో 18 నెలల నుంచి పని చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా ఆఫీస్ సబార్డినేట్‌గా పని చేస్తున్న యాదయ్య 14 నెలల నుంచి డీఎంహెచ్ఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. పీహెచ్‌సీ పరిధిలో 4 ఉప ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని, ప్రతి ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు చొప్పున మొత్తం 8 మంది ఏఎన్ఎంలు పని చేయాల్సి ఉండగా, ఆరుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. రెండు ఏఎన్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయని డీఎంహెచ్ఓకు విన్నవించారు. ప్రతి ఉప కేంద్రానికి ఒక హెల్త్ అసిస్టెంట్ చొప్పున మొత్తం నలుగురు పని చేయాల్సి ఉండగా, ప్రస్తుతం ఒక్కరే పని చేస్తున్నారని చెప్పారు. అదే విధంగా ఒక మేల్ సూపర్‌వైజర్, ఒక ఫిమేల్ సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇటీవల ఆరోగ్య కేంద్రం నుంచి ఇద్దరు వైద్యులు బదలీ కాగా, ప్రస్తుతం ఒక్క వైద్యురాలు వచ్చారని చెప్పారు. మరో డాక్టర్ పోస్టు ఖాళీగా ఉందన్నారు. ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్మి వెంకటేశు, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులతో విజ్ఞానం

- జేఎన్‌టీయూ హైదరాబాద్ విశ్వవిద్యాలయ రెక్టార్ డాక్టర్ గోవర్ధన్
- విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్ సదస్సు

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు సదస్సుల్లో పాల్గొంటే విజ్ఞానం పెరుగుతుందని జేఎన్‌టీయూ హైదరాబాద్ విశ్వవిద్యాలయ రెక్టార్ డాక్టర్ ఏ గోవర్ధన్, టెక్ మహేంద్ర గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్ బీకే మిశ్రా సూచించారు. శుక్రవారం మండలంలోని హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలో గల విద్యా జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం వారు 2023 సందర్భంగా కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్, డేటా ఇంజనీరింగ్‌పై 2వ అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ ఏ గోవర్ధన్, బీకే మిశ్రా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్, డేటా ఇంజనీరింగ్ డోమైన్‌లో తమ ఆలోచనలు పరిష్కరించుకునేందుకు ఎంతో వీలుంటుందన్నారు. పరిశోధకులు, శాస్త్రవేతలు, పరిశ్రమల నాయకులు విద్యార్థులకు చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించేందుకే ఈ సదస్సు లక్ష్యమన్నారు. అనంతరం సదసుసకు సంబంధించిన పోస్టర్లు, పుస్తకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనురాగ్ గ్రూప్ వీసీ ఎస్ రామచంద్రం, అనురాగ్ యూనివర్సిటి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సయిదా సమీన్, కళాశాల డైరెక్టర్ సాయిబాబా రెడ్డి, కన్ఫరెన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ ఏ పద్మజ, డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ గోవర్ధన్

హత్యాయత్నం నిందితుడికి ఏడేళ్ల జైలు

2017లో కూతురు, అత్తపై బ్లేడ్‌తో దాడి


మహేందర్(ఫైల్)

ఇబ్రహీంపట్నం: కూతురు, అత్తపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తికి ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నంకు చెందిన అనూరాధకు 2014లో మహేందర్‌తో వివాహం జరిగింది. వీరికో పాప ఉంది. కొన్ని రోజుల తర్వాత మహేందర్ అదనపు కట్నం కోసం భార్యను వేధించడం మొదలు పెట్టాడు. 2016లో బాధిత మహిళ యాచారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి నుంచి తల్లి ఇంట్లోనే ఉంటూ ఉద్యోగానికి వెళ్లివచ్చేది. 2017 జనవరి 19న భార్య ఉద్యోగానికి వెళ్లిన సమయంలో ఆమె ఇంటిలోకి మహేందర్ ప్రవేశించాడు. అత్త కళావతిని చంపేందుకు బ్లేడుతో మేడ, కడుపుపై దాడి చేశాడు. అనంతరం కూతురు పై దాడికి యత్నించాడు. కళావతి కేకలు పెట్టడంతో చుట్టూ పక్కల వాళ్లు వచ్చా రు. దీంతో మహేందర్ పారిపోయాడు. భార్య అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమో దు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం స్థానిక అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నాగరాజు నిందితుడికి ఏడేళ్ల జైలు శిక్ష విధించారు.